సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం। 4। డిసెంబర్। 2023



జూ ఆదాయం రూ.6.19 లక్షలు

విశాఖ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. రూ.6.19 లక్షల ఆదాయం వచ్చింది. 10లో



ఎంఎస్ఎంఈలపై సర్వే!

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల)పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధమవుతోంది. 10లో



వరి పంట సంరక్షణలో రైతులు

రాజవొమ్మంగి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని రైతులు వరి పంట సంరక్షణలో నిమగ్నమయ్యారు.

న్యూస్‌రీల్

పార్లమెంట్ సమావేశాలకు అరకు ఎంపీ

కొయ్యూరు: అరకు ఎంపీ మాధవి పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతున్న నేపథ్యంలో ఆమె కొద్దిరోజులపాటు ప్రజలకు అందుబాటులో ఉండరని ఎంపీ మీడియా ఇన్‌చార్జి రామ్ ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలకు ఆమె ఆదివారం విశాఖ నుంచి బయలుదేరి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

క్రికెటర్ గౌతమ్ గంభీర్‌తో ఎంపీ మాధవి

- విశాఖ విమానాశ్రయంలో కలయిక



గౌతమ్ గంభీర్‌ను కలిసిన ఎంపీ మాధవి

కొయ్యూరు: టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్‌ను విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం అరకు ఎంపీ మాధవి కలిశారు. గంభీర్ కూడా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలకు వెళ్లడానికి మాధవి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.అక్కడ వీఐపీ లాంజ్‌లో ఉన్న క్రికెటర్ గంభీర్‌తో కొద్దిసేపు ఆమె మాట్లాడారు.

సౌత్ జోన్ క్రీడా పోటీల్లో డీఏవీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన సీలేరు డీఏవీ పాఠశాల విద్యార్థులు

సీలేరు: తెలంగాణా రాష్ట్రం పాల్వంచలో జరిగిన డీఏవీ సౌత్ జోన్ క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ అండర్–17 విభాగంలో సీలేరుకు చెందిన డీఏవీ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివధ క్రీడల్లో విద్యార్థులు కె.హేమంత్, ఎస్కే ఆషిక్, కె.దీక్షిత్, ఎస్కే అమర్ బాషా, కె.దీక్షిత్, జీవన్, ఎస్కే ఖాదర్ బాషా ప్రతిభ కనబరిచారు. వీరిని, తర్ఫీదు ఇచ్చిన పీఈటీ జి.కమలాకర్‌ను ప్రిన్సిపాల్, ఏపీ జెన్‌కో ఎస్ఈ, ఏఈలు అభినందించారు.

ఏజెన్సీ చట్టాలను పరిరక్షించుకోవాలి

- ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్



జెండాను ఆవిష్కరిస్తున్న కణితి శేఖర్

ఎటపాక: ఏజెన్సీ చట్టాలను రక్షించుకోవడంలో ప్రతిఒక్కరు కృషిచేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఆట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కణితి శేఖర్ కోరారు. ఆదివారం నల్లకుంట ఆశ్రమ పాఠశాల ఆవరణలో జండాను ఆవిష్కరించి ఆట జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంత పరిరక్షణకు ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టం కోసం పోరాడుతున్నామని అన్నారు.1/70, పెసా చట్టాలను రక్షించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు సరియం అనిల్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు,సోయం హనుమంతరావు,రాష్ట్ర కార్యదర్శి పూనసం శ్రీను,సోడె నారాయణ,సుబ్బయ్య,సరియం రాజులు,రాములు,దేవరాజు,నాగేశ్వరావు పాల్గొన్నారు.

నేడు హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచి ప్రారంభం



పాడేరులో ప్రారంభం కానున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచి

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 4వతేదీ సోమవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలను అందుబాటులోకి రానున్నాయి. పాడేరు నుంచి జి.మాడుగుల పోయే రోడ్డులోని పాత పాడేరు జంక్షన్ ప్రాంతంలోని ఓ అద్దె భవనంలో బ్యాంక్ బ్రాంచిని ఏర్పాటుచేస్తున్నట్టు సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి.

సివిల్స్‌లో మెరిసేలా..

- గిరి యువతకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ
- రంపచోడవరం ఐటీడీఏ కార్యాచరణ
- రాత పరీక్ష ద్వారా 75 మంది ఎంపిక
- ఈ నెల 15 నుంచి శిక్షణ తరగతులు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు



సివిల్స్ ఉచిత శిక్షణకు రంపచోడవరం వైటీసీలో రెండ దఫా పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

రంపచోడవరం: ఆదివాసీ యువతకు ఉత్తమ భవిష్యత్తు కల్పించే లక్ష్యంగా రంపచోడవరం ఐటీడీఏ కసరత్తు మొదలు పెట్టింది. దీనిలో భాగంగా ఆల్ ఇండియా సర్వీస్ పరీక్షకు ఉచితంగా అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందుకు సంబంధించి ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ప్రణాళికపరంగా చర్యలు చేపట్టారు. శిక్షణ పొందేందుకు ప్రాథమిక పరీక్ష ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు ఆదివారం తుది పరీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు రంపచోడవరంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో తొమ్మిది నెలలు పాటు ఉచిత శిక్షణ ఇస్తామని ఐటీడీఏ అధికారవర్గాలు తెలిపాయి.

శిక్షణకు ఏర్పాట్లు

రంపచోడవరం ఐటీడీఏలో గిరిజన యువతకు సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు రాసేందుకు శిక్షణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తక్కువ ఖర్చుతో, ఉత్తమమైన శిక్షణ ఇచ్చేలా పీవో సూరజ్ గనోరే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీరితో పాటు న్యూఢిల్లీ, విశాఖ, హైదరాబాద్ కేంద్రాలుగా సివిల్స్ సర్వీసెస్‌కు శిక్షణ ఇస్తున్న 21 సెంచరీ వారు కూడా అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడంలో భాగస్వామ్యులు కానున్నారు.

తుది దశకు అభ్యర్థుల ఎంపిక

సివిల్ శిక్షణకు సంబంధించి అభ్యర్థుల ఎంపికకు రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని అభ్యర్థులు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహణ పూర్తి చేశారు. పరీక్ష రాసేందుకు 499 మంది దరఖాస్తు చేసుకోగా 422 మంది అభ్యర్థులు ప్రాథమిక పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 150 మంది అర్హత సాధించారు. చింతూరు డివిజన్‌కు సంబంధించి 145 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 51 మంది ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించారు. చింతూరు, రంపచోడవరం వైటీసీల్లో ఆదివారం నిర్వహించిన పరీక్షకు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. తుది ఫలితాలు ఈనెల 5వ తేదీన ప్రకటిస్తారు. 8,9 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి శిక్షణ కోసం రెండు డివిజన్‌ల్లోను 75 మందిని ఎంపిక చేస్తారు. డిసెంబరు 15 తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.తొమ్మిది నెలలపాటు నిర్వహించే ఈ శిక్షణకు దాదాపుగా రూ.30 లక్షలకు పైగా రంపచోడవరం ఐటీడీఏ వెచ్చిస్తోంది.

యువతకు ఎంతో మేలు



డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాలకు కోసం ఎదురు చూస్తున్న గిరిజన యువతకు సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ కోసం పరీక్ష నిర్వహించడం చాలా సంతోషం. శిక్షణ కోసం కృషి చేసిన పీవోకు గిరిజన యువత రుణపడి ఉంటుంది. శిక్షణకు ఎంపికవుతామని నమ్మకం ఉంది.

– గొర్లె రాజేష్, ధారగెడ్డ, వై.రామవరం మండలం

శిక్షణ అభినందనీయం



సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2, ఉద్యోగాలకు శిక్షణ పొందాలంటే వేలల్లో ఖర్చవుతుంది. ఈ ప్రాంతంలో గిరిజనులు అంత ఖర్చు పెట్టి శిక్షణ పొందాలంటే చాలా కష్టమైన పని. రంపచోడవరం ఐటీడీఏ పీవో శిక్షణకు శ్రీకారం చుట్టడం అభినందనీయం.

–జర్తా జోగి రత్నం, తుంగమడుగుల, అడ్డతీగల మండలం

గిరి యువత సత్తా చాటాలి



గిరిజన యువత సివిల్స్, గ్రూప్స్ ఉద్యోగాల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆశయానికి తగ్గట్టుగా మంచి ఫలితాలు సాధించి సత్తా చాటుతారని ఆశిస్తున్నాం.

– సూరజ్‌గనోరే, పీవో రంపచోడవరం ఐటీడీఏ

మిచాంగ్ తుపానుతో అప్రమత్తం

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



సాక్షి,పాడేరు: మిచాంగ్ తుపానుతో రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తుపాను సమయంలో గంటకు 90 నుంచి వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందన్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటవచ్చని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూముల్లో కోసిన వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లు రక్షణగా ఏర్పాటు చేయాలని సూచించారు. జలాశయాలు, గెడ్డలో చేపల వేటకు మత్స్యకారులకు వెళ్లవద్దని సూచించారు. గిరిజనులు ప్రమాదకర గెడ్డలు, వాగులు దాటి ప్రయాణాలు చేయవద్దని ఆయన కోరారు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే పరిస్థితులు ఉన్నందున ఆయా లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆయన కోరారు. జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగమంతా స్థానికంగానే అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జర గకుండా తగిన చర్యలు తీసుకోవాలని.జిల్లాలోని రెవెన్యూ,ఆర్అండ్‌బీ, విద్యుత్‌శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ నష్టం జరిగినా వెంటనే తదుపరి చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు.

జంట హత్యల కలకలం

- ఇద్దరి ప్రాణం తీసిన వివాహేతర సంబంధం
- ఎర్రంపేటలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



శ్రీకాంత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఓఎస్డీ మహేశ్వరరెడ్డి



ఘటనాస్థలంలో శ్రీకాంత్ మృతదేహం





మృతులు శ్రీకాంత్, ప్రియాంక (ఫైల్)

చింతూరు: వివాహేతర సంబంధం నేపథ్యంలో చింతూరు మండలం ఎర్రంపేటలో శనివారం అర్ధరాత్రి జరిగిన జంటహత్య కలకలం రేపింది. సీఐ గజేంద్ర కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రంపేటకు చెందిన ఉన్నం శ్రీకాంత్ (38), మద్ది ప్రియాంక(30) కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వీరిద్దరూ శ్రీకాంత్ స్నేహితుడి ఇంట్లో ఉండటాన్ని గమనించిన ప్రియాంక భర్త దుర్గాప్రసాద్ ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే అక్కడికి వెళ్లి ఇనుపరాడ్డుతో వారిద్దరిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రియాంకకు కూడా తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావుహుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని కొనవూపిరితో ఉన్న ప్రియాంకను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఘటనా స్థలం పరిశీలన

రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడు దుర్గా ప్రసాద్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతుడు శ్రీకాంత్‌కు భార్య, కొడుకు ఉండగా మృతురాలు ప్రియాంకకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లి మృతి, తండ్రి జైలుకెళ్లే పరిస్థితుల నేపథ్యంలో ప్రియాంక పిల్లలు అనాధలుగా మిగిలారు.

పర్యాటక ప్రాంతాల్లో వీకెండ్ సందడి



చెరువుల వేనంలో సందడి చేస్తున్న పర్యాటకులు



సరియా జలపాతం వద్ద పర్యాటకుల సందడి



చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

చింతపల్లి రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చెరువులవేనంకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. తుపాను కారణంగా మంచు కురవకపోవడంతో నిరాశకు గురయ్యారు.

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. సరియా,చిట్టంపాడు, కటికి, తాటిగుడ జలపాతాల్లో పర్యాటకులు స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అరకు–విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డముకు వ్యూపాయింట్, భీసుపురం కాఫీ ప్లాంటేషన్, గాలికొండ వ్యూపాయింట్ పర్యాటకులతో సందడి నెలకొంది.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులతో సందడి నెలకొంది. మైదాన ప్రాంతాల నుంచి కుటుంబసమేతంగా తరలివచ్చారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి సందడి చేశారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

6న శోభాయాత్ర

వై.రామవరం: మండల కేంద్రంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ ఎం.సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వాయు వేగం!

- విశాఖలో ఉధృతమైన హోరుగాలులు
- నేటి నుంచి మరింత తీవ్రతరం
- గంటకు 75 కి.మీల వేగానికి పెరిగే అవకాశం
- తుపాను తీరం దాటాక ఉత్తరాంధ్ర వైపు పయనం





తుపాన దాటికి విశాఖలో ఎగసి పడుతున్న అలలు

సాక్షి, విశాఖపట్నం: తుపాను ప్రభావం విశాఖపై మొదలైంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో గాలుల ఉధృతి శనివారం రాత్రి నుంచి ఆరంభమైంది. ఆదివారం తుపానుగా బలపడడంతో గాలుల తీవ్రత అధికమైంది. ఉదయం నుంచి శబ్దాలు చేసుకుంటూ హోరు గాలులు వీస్తూనే ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో సుడిగాలులు కొనసాగుతున్నాయి. వీటి ధాటికి ఇళ్ల కిటికీలు, తలుపులు కొట్టుకుంటున్నాయి. దుమ్ము, ధూళి చెలరేగి ద్విచక్ర వాహన చోదకులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న వారి కళ్లలో పడుతూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. సోమవారం తీవ్ర తుపానుగా మారనుండడంతో ఈదురుగాలుల తీవ్రత మరింత పెరగనుంది. ప్రస్తుతం గంటకు 45–55 కి.మీల వేగంతో జిల్లాలో ఈదురుగాలులు వీస్తున్నాయి. రానున్న రెండు రోజులు వీటి వేగం 65–75 కి.మీలకు చేరుకుంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. మరోవైపు మిచాంగ్ తుపాను మంగళవారం తీరాన్ని దాటనుంది. అనంతరం అది ఉత్తరాంధ్ర వైపు కదులుతుంది. ఆరో తేదీ వరకు తీవ్ర వాయుగుండం, వాయుగుండం, అల్పపీడనంగా క్రమంగా బలహీనపడుతూ ఉత్తరాంధ్ర వరకు పయనించనుంది. దీని ప్రభావం కూడా విశాఖపై ఉండనుంది.

6వ తేదీ వరకు వానలు

తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విశాఖ జిల్లాలో వర్షాలు మొదలు కానున్నాయి. ఐఎండీ నివేదిక ప్రకారం సోమ, మంగళ, బుధవారాల్లో విశాఖతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో ఈదురుగాలులకు చలిగాలులు కూడా తోడై శీతల వాతావరణాన్ని ఉధృతం చేస్తోంది.

తీరానికి చేరుకుంటున్న బోట్లు

మరోవైపు సముద్రంలో చేపలవేటకు వెళ్లిన బోట్లు తీరానికి చేరుకుంటున్నాయి. బలమైన ఈదురుగాలులతో పాటు అలలు ఎగసి పడుతున్నందున వేటకు వెళ్లవద్దని ఇప్పటికే ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సముద్రంలో వేట సాగిస్తున్న బోట్లన్నీ ఒక్కొక్కటికీ తీరానికి వస్తున్నాయి.

ఉరివేసుకొని బాలిక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకొన్న గాయత్రి

దేవీపట్నం : మండల పరిధిలోని కచ్చులూరు ఆర్అండ్ఆర్ కాలనీలో శనివారం రాత్రి ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాలనీకి చెందిన నేరం గాయత్రి (17), అదే కాలనీకి చెందిన నరసింహం ప్రేమించుకున్నారు. కాగా నరసింహం మద్యానికి బానిస కావడంతో గాయత్రి అతడిని మద్యపానం మానుకోమని పలుమార్లు మందలించింది. శనివారం కూడా మరోమారు మద్యం విషయమై మందలించింది. అయినా అతడు పెడచెవిన పెట్టడంతో క్షణికావేశంలో గాయత్రి ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సంఘటన ప్రదేశాన్ని సీఐ వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్ఐ రంగారావు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణమని వారు తెలిపారు. ప్రియుడు నరసింహంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు తెలిపారు.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



వెదురునగరంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ నర్సింహమూర్తి



అంతర్లలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రమేష్, సిబ్బంది

వై.రామవరం: వై.రామవరం–అడ్డతీగల ప్రధాన రహదారిలో మండల సరిహద్దు ప్రాంతమైన వెదురునగరం వారపు సంతలో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దుశ్చర్తి ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులు, అపరిచితులపై నిఘా ఏర్పాటుచేశారు.

చింతపల్లి రూరల్: మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా అంతర్ల ప్రాంతంలో సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలను సేకరించి విడిచిపెట్టారు. ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

అన్నదాతలో తుపాను కలవరం



గురుపల్లి ప్రాంతంలో కుప్పలు వేస్తున్న రైతులు



వరి కుప్పలపై ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ కవర్లు



గురుపల్లి ప్రాంతంలో వరి పనలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న గిరిజన మహిళలు



లగిశపల్లిలో వరి పనల కుప్పలకు ప్లాస్టిక్ కవర్లు

వాతావరణంలో మార్పులతో ఆందోళన

సాక్షి,పాడేరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మార్పు ఏర్పడింది. రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతం కావడంతోపాటు చలిగాలులు వీస్తున్నాయి. ఘాట్ ప్రాంతాల్లో గాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తమయ్యారు. వరి కోతలు నిలిపివేశారు. కోసిన చోట వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించి టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పిస్తున్నారు. రాగులు, సామలు, కొర్ర పంటలను కోసి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

డుంబ్రిగుడ: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో రైతులు అపరమత్తమయ్యారు. వరి కుప్పలకు టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పించారు.

మార్కెట్ కలిపిన బంధం

మార్కెట్ అంటే.. కొందరి వ్యక్తుల మధ్య జరిగే వ్యాపారం. రైతు సరకు ఉత్పత్తి చేస్తాడు. వ్యాపారి వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తాడు. వినియోగదారుడు ఆ సరకులను కొనుగోలు చేస్తాడు. ఇంతేనా.? మరో కోణంలో చూస్తే.. సరికొత్త బంధం కనిపిస్తుంది. రక్త సంబంధం లేకపోయినా.. బంధువులు కాకపోయినా.. అందరూ వ్యాపారులు, కొనుగోలుదారులే అయినప్పటికీ.. ఇంటి మనుషుల్లా వ్యవహరించే తీరు ఆకర్షిస్తుంది. ఏం అక్కా బాగున్నావా.? రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. మంచి క్యారెట్ వచ్చింది. తీసుకెళ్లు.! హాయ్ అన్నా.. క్యాబేజీ బాగుంది.. గిట్టుబాటవుతుంది.! ఏం బావా లేటైంది.. ఇంకొంచెం ముందు వచ్చుంటే.. బాగుండేది.. మంచి క్వాలిటీ క్యాప్సికమ్ వచ్చింది.. ఇలాంటి ఆప్యాయతల పిలుపుతో మార్కెట్ సందడిగా ఉంటుంది. పని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఇలాంటి ప్రపంచం జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో మనకు తారసపడుతుంది.

– విశాఖపట్నం డెస్క్

- ఉపాధినిస్తున్న జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి పని
- వ్యాపారులు, కొనుగోలుదారుల మధ్య పెనవేసుకున్న అనుబంధం



జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్



మార్కెట్ నుంచి కూరగాయల తరలింపు

జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌పై ఆధారపడిన వ్యాపారులు, గుమాస్తాలు, కలాసీలు, ఇక్కడ సరకులు కొనుగోలు చేసి నగరంలో విక్రయించే వారి దినచర్య ప్రతి రోజూ వేకువజాము 3 గంటలకే ప్రారంభమవుతుంది. రైతులు పండించిన పంటలు ఎక్కడెక్కడి నుంచో జ్ఞానాపురం మార్కెట్‌కు చేరుకుంటాయి. వ్యాపారులు దగ్గరుండి కలాసీల ద్వారా సరకులు దింపిస్తారు. మీకేంటి రెండు చేతులా సంపాదిస్తారు అంటాం గానీ.. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు వీళ్లు ఒళ్లంతా కళ్లు చేసుకుంటే కానీ వ్యాపారం సాగదు. కూరగాయలు, ఆకుకూరలు ఏ రోజుకు ఆ రోజు విక్రయాలు పూర్తి చేస్తే హ్యాపీ.. ధర బాగుండి.. డిమాండ్ ఉంటే ఒకే.. లేకపోతే ఆ రోజు నష్టం తప్పదు. ఇక ఒక్కో దుకాణం మీద ఆధారపడి పదుల సంఖ్యలో గుమస్తాలు, కలాసీలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరికి జీతాలు, రోజువారీ కూలీ ఇస్తుండగా.. మరికొందరు చేతనైన పనిచేస్తూ ఇచ్చింది తీసుకెళ్తుంటారు. ఒక్కసారి కూరగాయల మార్కెట్‌లోకి అడుగుపెడితే ఓ ప్రపంచమే కళ్ల ముందు కనిపిస్తుంది. రైతు కష్టం, కలాసీ జీవనం, వ్యాపారి మార్కెటింగ్ వ్యూహం తెలుస్తుంది.

ఉదయాన్నే మరో ప్రపంచం

కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న సరకును ఇక్కడి వ్యాపారులు ఉదయం 3.30 గంటల నుంచి విక్రయానికి ఉంచుతారు. ఇక్కడి నుంచి రైతుబజార్ల వ్యాపారులు, హోటళ్ల యజమానులు, రిటైల్ వ్యాపారులు, హోటళ్లకు సరఫరా చేసేవారు, తోపుడు బండ్ల వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేస్తారు. కొంత మంది వ్యాపారులు రిటైల్‌గా కూడా విక్రయిస్తారు. ఇక్కడ కొనుగోలు చేసిన వాళ్లు తిరిగి వాటిని ఇళ్ల వద్ద దుకాణాల్లో, తోపుడు బండ్లపై విక్రయిస్తుంటారు. ఇలా మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్కెట్‌లో హడావిడి కనిపిస్తుంది.

కరోనా సమయంలోనూ..

మార్కెట్‌కు ప్రతీ ఆదివారం సెలవు. సంక్రాంతి, దసరా, మే డే, నాగులచవితి తదితర రోజుల్లో సెలవు ఉంటుంది. మిగతా అన్ని రోజులు పనిచేస్తుంది. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ మార్కెట్ తెరిచారు. మార్కెట్‌కు పక్కనే ఉన్న శ్మశానవాటికలో ఓ పక్క మృతదేహాలు కాలుతుంటే.. ఇక్కడ వ్యాపారులు, కలాసీలు, గుమస్తాలు ధైర్యంగా పనిచేసి.. నిత్యావసరాల్లో భాగమైన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూశారు. కరోనాకు ఎదురొడ్డి నిలిచి అందరి ఆకలి తీర్చారు.

మార్కెట్ చరిత్ర

నగరంలో కూరగాయల మార్కెట్ అంటే ఠక్కున గుర్తొచ్చేది పూర్ణా మార్కెట్. బ్రిటిష్ ప్రభుత్వం 1935లో నిర్మించిన ఈ మార్కెట్ స్వాతంత్ర్యం అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్‌గా మారింది. సొంత భవనాల్లో వ్యాపారులు హోల్‌సేల్‌గా కూరగాయలు, పండ్లు, కిరాణా సరకులు విక్రయించేవారు. రోజురోజుకూ వినియోగదారుల తాకిడి పెరగడం, రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. 1988లో అప్పటి మేయర్ డి.వి. సుబ్బారావు, కమిషనర్ మహంతి కూరగాయలు, పండ్లు, అరటి పండ్ల వ్యాపారులతో సమావేశయ్యారు. వేరే ప్రాంతంలో పునరావాసం కల్పిస్తామని, హోల్‌సేల్ మార్కెట్లు తరలించాలని ప్రతిపాదన చేశారు. మొదట్లో ససేమిరా అన్న వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో కొన్ని షరతులతో ఒకే చెప్పారు. ఈ క్రమంలో జ్ఞానాపురంలో స్థలం కేటాయించడంతో.. సొంతంగానే వ్యాపారులు షెడ్లు వేసుకున్నారు. అలా 1990లో హోల్‌సేల్‌గా కూరగాయల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో సరిగ్గా వ్యాపారాలు సాగలేదు. అందరూ పూర్ణా మార్కెట్‌కే వెళ్లేవారు. 2000 సంవత్సరం నుంచి వ్యాపారాలు ఊపందుకున్నాయి. మొదట్లో ఇక్కడకు వస్తామన్న అరటి పండ్లు, పండ్ల వ్యాపారులు తర్వాత రాలేదు. 33 ఏళ్లుగా ఈ మార్కె ట్ నగర ప్రజల కూరగాయల అవసరాలు తీరుస్తోంది. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఇదీ మార్కెట్ స్వరూపం

మార్కెట్ ప్రారంభం	1990
విస్తీర్ణం	1.7 ఎకరాలు
దుకాణాలు	66
కలాసీలు	సుమారు 1,000
గుమస్తాలు	400 నుంచి 500
రిక్షా కార్మికులు	200 నుంచి 300
ఆటో కార్మికులు	300 నుంచి 400
లారీ కార్మికులు	300 నుంచి 400
పరోక్షంగా ఉపాధి పొందుతున్న కుటుంబాలు	5 వేలు

కూరగాయలు వచ్చేది ఇలా..



మహారాష్ట్ర నుంచి ఉల్లి, పశ్చిమ బెంగాల్ నుంచి బంగాళాదుంపలు(పాత), ఇండోర్ నుంచి కొత్త బంగాళాదుంపలు, కర్నాటక నుంచి టమాటా, ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బిహార్ నుంచి చిక్కుడు, మిర్చి, బీన్స్, పొటల్స్, గ్రీన్ ప్రీస్, బెండ, దొండ, కీర, ఆనపకాయ, హైదరాబాద్ నుంచి బీట్‌రూట్, క్యారెట్, కర్నాటక నుంచి క్యాప్సికం, అల్లం, బీన్స్ తదితర కూరగాయలు ఈ మార్కెట్‌కు వస్తాయి. మన రాష్ట్రంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉత్పత్తయ్యే కూరగాయాలు మార్కెట్ వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లి నుంచి టమాటా, విజయవాడ నుంచి కరివేపాకు, చింతల అగ్రహారం ఆకుకూరలు, అరకు, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల నుంచి అల్లం, బీన్స్, పార్వతీపురం, రామభద్రాపురం, కొవ్వూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కాలీఫ్లవర్, కత్తిపూడి, పిఠాపురం, ద్వారపూడి తదితర ప్రాంతాల నుంచి బెండ తదితర కూరగాయలు వస్తాయి.



పచ్చిమిర్చి విక్రయిస్తున్న వ్యాపారులు

వైష్ణవి మార్కెట్‌గా పేరు నిర్ణయించాం



పూర్ణామార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ పెరగడంతో అప్పటి మేయర్, కమిషనర్ కోరిక మేరకు జ్ఞానాపురంలో షెడ్లు వేసుకుని హోల్‌సేల్ మార్కెట్‌ను ప్రారంభించాం. 33 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం సాగిస్తున్నాం. ఇక్కడ వ్యాపారులు, కలాసీలతో ఓ అనుబంధం ఉంది. ఇన్ని రోజులు మార్కెట్‌కు పేరంటూ లేదు. అందరూ చావులమదుం మార్కెట్ అని పిలిచేస్తున్నారు. ఇలా పిలవడం ఇబ్బందికరంగా ఉంది. అందుకే వైష్ణవి హోల్‌సేల్ వెజిటెబుల్ మార్కెట్‌గా పేరు పెట్టాలని అందరం కలిసి తీర్మానించాం

– కొణతాల వీర్రాజు, యూనియన్ అధ్యక్షుడు

మంచి వాతావరణంలో వ్యాపారం



నా 14వ ఏటనే ఈ రంగంలోకి వచ్చాను. నాన్న పేరుతో షాపు కొనసాగుతోంది. మార్కెట్‌లో 66 దుకాణాలు ఉన్నాయి. దాదాపు 1000 మంది వరకు కలాసీలు ఉన్నారు. ఇక్కడ మంచి వాతావరణం ఉంటుంది. కలాసీలను వ్యాపారులంతా కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. మార్కెట్‌లో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటాం. మార్కెట్‌కు చెందిన సౌభాగ్య గణపతి ఆలయంలో చైర్మన్ కోరిబిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో వారం వారం అన్నదానం నిర్వహిస్తున్నాం.

– విల్లూరి పరమేశ్వరరావు, యూనియన్ కార్యదర్శి

ఎన్నో జ్ఞాపకాలున్నాయి..



నాది వాడచీపురుపల్లి. పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ఉంటున్నాను. మొదట్లో పూర్ణామార్కెట్‌లో కలాసీగా పనిచేసేవాడిని. జ్ఞానాపురంనకు మార్కెట్ తరలిరావడంతో అప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్నాను. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కలాసీగా పనిచేస్తూనే పెద్ద అమ్మాయిని ఎంఎస్సీ, చిన్న అమ్మాయిని బి.టెక్ చదివించి.. పెళ్లిళ్లు చేశాను. అర్ధరాత్రి 2 గంటలకు నిద్ర లేస్తాను. చద్దన్నం పట్టుకుని మూడు గంటలకు మార్కెట్‌కు వచ్చేస్తాను. ఇక్కడ పని చూసుకుని మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వెళ్తాను. అప్పట్లో రూ.300 నుంచి రూ.400 వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.800 నుంచి రూ.1000 వరకు వస్తోంది. ఈ మార్కెట్‌తో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకున్నాయి.

– రెడ్డి ముత్యాలనాయుడు, కలాసీ

20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా



ఈ మార్కెట్‌తో ఎంతో అనుబంధం ఉంది. 20 ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నా. వేకువజామున 3.30 గంటలకే మార్కెట్‌కు చేరుకుంటాం. లావాదేవీలన్నీ పూర్తయ్యే సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటిపోతుంది. కరోనా సమయంలోనూ వ్యాపారం ఆపలేదు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నగర ప్రజలకు తాజా కూరగాయలు అందించాం.

– రొంగళి ప్రకాష్‌రావు, వ్యాపారి

పరిశుభ్రతపై అవగాహన

- సీఆర్‌పీఎఫ్ బలగాల స్వచ్ఛభారత్



స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిఆర్‌పీఎఫ్ పోలీసులు

వై.రామవరం: సీఆర్‌పీఎఫ్ డీ-42 బెటాలియన్ అదనపు బలగాల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పలు ప్రాంతాల్లో పర్యటించి, పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు మాట్లాడుతూ గ్రామంలో పలు దేవాలయాలతో ఆపటు ఆస్పత్రి, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రం చేశామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు తెలిపారు.

కారు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



గాయపడిన పర్యాటకులు



సాదేకు వద్ద ప్రమాదానికి గురైన కారు

జి.మాడుగుల : జి.మాడుగుల- చింతపల్లి రోడ్డు మార్గంలో పర్యాటకుల కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. గుంటూరుకు చెందిన మధుకర్(డ్రైవర్),ఇరిమాస్, అజయ్, అజీస్, కలీంఅల్లా, మహ్మద్‌ఖాన్, సంతాన్ శనివారం రాత్రి చింతపల్లి మండలంలో లంబసింగి పర్యాటక కేంద్రానికి వచ్చారు. ఆదివారం ఉదయం 10గంటల సమయంలో తిరిగి అరకు వెళుతుండగా జి.మాడుగుల మండలంలో సాదేకు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

ముగ్గురు బైకు దొంగలకు జైలు శిక్ష

జి.మాడుగుల : బైకుల దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు 18 నెలలు జైలు శిక్ష విధిస్తూ పాడేరు జెఎఫ్‌సీఎం న్యాయమూర్తి తీర్పునిచ్చినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుబాల గలారి, సుభాస్ గలారి, అబలా బారీక్ అనే ముగ్గురు వ్యక్తులపై 15 బైకుల దొంగతనంపై సెప్టెంబర్ 6న 2022న పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, 15 బైకులను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ పాడేరు కోర్టు న్యాయమూర్తి శివకిరణ్ తీర్పునిచ్చారన్నారు. సీఐ సత్యనారాయణ అధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు.

మోదకొండమ్మ ఆలయంలో కుంకుమపూజలు



అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో కార్తీక ఆదివారం సందర్భంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి పాదాలు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయకమిటీ చైర్మన్ పుప్పాలఅప్పలరాజు ఉచితంగాప్రసాదం అందజేశారు.

జూ ఆదాయం రూ.6.19 లక్షలు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. కార్తీక మాసం మూడో ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో సందర్శకులు జూ పార్కును సదర్శించారు. పిల్లలు, పెద్దలు రోజంతా వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లు వద్ద సరదాగా గడిపారు. ఈమూలు, నెమళ్లు, ఆఫ్రికన్ చిలుకలు తదితర పలు రకాల పక్షులు, ఏనుగులు, కోతులు, చింపాంజీలు, పులులు, సింహాలు, అడవి కుక్కలు, హైనాలు, మొసళ్లు, పాములు సందర్శకులను అలరించాయి. జూలో ఇటీవల ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు. ఏడు వేల మందికిపైగా సందర్శకులు జూను సందర్శించగా రూ.6.19 లక్షలు ఆదాయం లభించినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: మిచాంగ్ తుపాను కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. 4వ తేదీన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 5వ తేదీన భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 6వ తేదీన ఎర్నాకుళం-టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్, 7వ తేదీన ఎస్ఎంవీ బెంగళూరు-గౌహతి (12509) ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఎంఎస్‌ఎంఈలపై సర్వే!

- దీనిపై త్వరలో వార్డు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ
- ఏ పరిశ్రమకు ఏమి అవసరమో సర్వే ద్వారా గణన
- విశాఖ జిల్లాలో 14,433 ఎంఎస్ఎంఈలు
- వీటి ద్వారా 1.55 లక్షల మందికి ఉపాధి అవకాశాలు

సాక్షి, విశాఖపట్నం: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల)పై సమగ్ర సర్వేకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయడం కోసం ఈ సర్వేను చేపడుతోంది. వార్డు, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఈ సర్వే నిర్వహించనున్నారు. ఇటీవల వీరికి సర్వేపై ఆన్‌లైన్‌లో ప్రాథమికంగా అవగాహన కల్పించారు. త్వరలో వీరికి జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం సర్వేను మొదలు పెడతారు. సర్వేలో వివిధ రంగాల వారీగా ఎన్ని ఎంఎస్ఎంఈ యూనిట్లున్నాయి? వాటి ఉత్పత్తి పరిమాణం ఎంత? భవిష్యత్తు అవసరాలేమిటి? మానవ వనరుల లభ్యత, నైపుణ్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు? ఏ తరహా నిపుణులు ఎంతమంది అవసరం? వంటి వాటిపై సమగ్రంగా సర్వే చేస్తారు. ఈ అంశాలు ఎంఎస్ఎంఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. సర్వేను అనుసరించి అవసరమైన నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణనిచ్చి ఎంఎస్ఎంఈల్లో నియామకాలు చేపడతారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సర్వే ప్రక్రియను ప్రారంభిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి 'సాక్షి'కి చెప్పారు.

జిల్లాలో 14,433 ఎంఎస్ఎంఈలు

విశాఖ జిల్లాలో ఉత్పత్తి ప్రారంభించిన ఎంఎస్ఎంఈలు 14,433 ఉన్నాయి. వీటిలో స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేషన్, బేకరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రీసైక్లింగ్ యూనిట్లు, మెడికల్, మాడ్యులర్ ఫర్నిచర్, కోల్డ్ స్టోరేజిలు, లేబరేటరీలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, రెడీమేడ్ గార్మెంట్స్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రిక్ రిపేర్లు, గూడ్స్/పాసింజర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసులు, కన్వెన్షన్ సెంటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆయిల్ మిల్లులు, పీవీసీ పైపులు, వాటర్ ప్లాంట్లు, టెంట్ హౌస్‌లు వంటివి ఉన్నాయి. వీటి ద్వారా రూ.8,240.73 కోట్ల పెట్టుబడి సమకూరింది. వీటిలో 1,55,732 మంది ఉపాధి పొందుతున్నారు. ఇంకా ప్రారంభం కావలసిన ఎంఎస్ఎంఈలు 34 ఉన్నాయి. వీటితో మరో 670 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

బోల్తా పడిన సూపర్‌స్టార్స్

కీలక మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ విజయం



రజాక్ ఓవర్లలో ఔటైన ధ్రువ్.. క్యాచ్ పట్టిన దిండాను అభినందిస్తున్న శ్రీవత్స్



షాట్ కొడుతున్న గుజరాత్ జెయింట్స్ బ్యాట్‌మన్

విశాఖ స్పోర్ట్స్: కచ్చితంగా విజయం సాధించాల్సిన మ్యాచ్‌లో సదరన్ సూపర్ స్టార్స్ బోల్తాపడింది. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ-20లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టీ-20 లీగ్‌లో ఇరు జట్లకు ఇదే చివరి మ్యాచ్. నాకవుట్ లక్ష్యంగా ఇరు జట్లు బరిలోకి దిగాయి. జెయింట్స్ కెప్టెన్ కెవిన్ టాస్ గెలిచి లక్ష్య ఛేదనకే మొగ్గుచూపడంతో సూపర్ స్టార్స్ రాస్ టేలర్ సేన తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తరంగ, జెస్సీ ఓపెనర్స్‌గా రాగా.. శ్రీశాంత్ ఇన్నింగ్స్ తొలి బంతిని విసిరాడు.

జట్టు స్కోర్ 18 పరుగుల వద్ద ఈశ్వర్ చౌదరి ఓవర్‌లో జెస్సీ వికెట్ల వెనుక రావల్‌కు దొరికిపోయి తొలి వికెట్‌గా వెనుతిరిగాడు. రెండో వికెట్‌కు తరంగ- శ్రీవత్స్ 55 పరుగులు జోడించడంతో పాటు బౌండరీల మోత మోగించారు. చివరికి సదరన్ సూపర్ స్టార్స్ జట్టు ఎనిమిది వికెట్లకు 159 పరుగులతో ఇన్నింగ్స్ ముగించింది. ప్రతిగా బ్యాటింగ్ ప్రారంభించిన జెయింట్స్ ఓపెనర్ ధ్రువ్ రావల్ డకౌట్‌గా తొలి వికెట్ కోల్పోయింది. ఇన్నింగ్స్ చక్కదిద్దే క్రమంలో మరో ఓపెనర్ కెవిన్(29) వెనుదిరగ్గా అతని స్థానంలో వచ్చిన రిజర్డ్ కేవలం ఒక పరుగే చేసి పెవిలియన్‌కు చేరాడు. ఈ స్థితిలో వచ్చిన అభిషేక్(81) 10 ఫోర్లు, మూడు సిక్సర్లతో అభిమానులను అలరించాడు.

అతనికి చిరాగ్(21)తోడయ్యాడు. చివర్లో చిగుంబురా(21) 10 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది మరో ఎనిమిది బంతులుండగానే జట్టును విజయతీరానికి చేర్చాడు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో అభిమానులు హాజరై మ్యాచ్‌ను వీక్షించారు.

నేడు మణిపాల్ టైగర్స్‌తో అర్బన్ రైజర్స్ ఢీ

లీగ్‌లో చివరి మ్యాచ్ సోమవారం మణిపాల్ టైగర్స్, అర్బన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. ఈ రెండు జట్లు మూడేసి మ్యాచ్‌ల్లో విజయంతో, ఓ పరాజయంతో ఆరేసి పాయింట్లు సాధించాయి. జెయింట్స్ ఏడు పాయింట్లతో ఆధిక్యంలో ఉంది. చివరి మ్యాచ్‌కు వర్షం పడే సూచనలున్నాయి. ఒకవేళ వర్షం పడకుండా పూర్తి మ్యాచ్ జరిగితే జెయింట్స్ ఆధిక్యాన్ని కోల్పోనుంది. కాగా.. ఒకే ఒక్క మ్యాచ్‌లో విజయం సాధించిన క్యాపిటల్స్, సూపర్‌స్టార్స్, కింగ్స్ జట్లు మూడేసి పాయింట్లతో లీగ్‌ను ముగించాయి. కాస్త మెరుగైన రన్‌రేట్‌తో క్యాపిటల్స్ జట్టు నాకవుట్‌కు చేరుకుంది. లెజెండ్స్ లీగ్ క్రికెట్ టీ-20 నాకవుట్ మ్యాచ్‌లు సూరత్‌లో జరగనున్నాయి.

పంచారామాలకు ప్రత్యేక బస్సు



పంచారామాలకు వెళ్లే భక్తులతో ప్రత్యేక బస్సు

అనకాపల్లిటౌన్: పంచారామాలకు పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆదివారం సాయంత్రం ప్రత్యేక బస్సు బయలుదేరింది. ఈ బస్సు సోమవారం తెల్లవారుజామున అమరావతి చేరుతుంది. అక్కడ భక్తులకు దర్శనం కల్పిస్తారు. తరువాత భీమవరం, పాలకొల్లు, దాక్షారామం, సామర్లకోటల్లో దర్శనం అనంతరం తిరిగి స్థానిక డిపోకు చేరుతుంది. వచ్చే ఆదివారం పంచారామ క్షేత్రాలకు వెళ్లే భక్తులు ముందుగా ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) డీపీటీవోను సంప్రదించాలని సిబ్బంది తెలిపారు.